# ప్రాథమికతలు

"ఎక్కడికెళ్లావు?"

"ఈటీవీలో మంచి ప్రోగ్రాముంటే పక్కింటికెళ్లానండీ"

"మన టీవీ కేమయింది?"

"చాల్లెండి మనదీ ఒక టీవీయే? కలరూ లేదు, పాడూ లేదు. తాతల కాలం నాటి సినిమాల్లోలా ఒట్టి నలుపు–తెలుపు."

"దినమంతా పనిచేసి బస్సులో నానాతంటాలు పడి కొంపచేరితే ఓ కాఫీ, కాస్త ఫలహారం ఇచ్చి సేదతీర్చడం పోయి, కలరు టీవీ పిచ్చి ఏమిటి పద్మా నీకు?"

"ఔనండీ, నాది పిచ్చనే అనిపిస్తుంది మీకు. చుట్టుపక్కలంతా ఎంచక్కా కలర్ టీవీ ఉండి, మన ఒక్కరింట్లోనే బ్లాక్ అండ్ వైట్ టీవీ అంటే ఎంత నామోషీగా ఉందో తెలుసా? అమ్మలక్కలు మన పీనాసివాళ్లం, కక్కుర్తి మనుషులం అని చెవులు కొరుక్కుంటుంటే తలెత్తుకోలేక పోతున్నాను. మీకేం? దినమంతా ఆఫీసులో ఉంటారు. ఇంట్లో ఉన్నవాళ్లకు తెలుస్తుంది."

"పే కమీషన్ ఎరియర్స్ రాగానే మనం చేసే మొదటి పని కలర్ టీవీ తేవడం, సరేనా? ఇప్పుడైనా కాస్త కాఫీ నీళ్లియ్యి?"

"మీ ఎరియర్లు ఎప్పుడొస్తాయో? మన ఇంటికి కొత్త టీ.వీ. ఎప్పుడొస్తుందో ఆ భగవంతుడికే తెలియాలి" అంటూ వంటింట్లోకి దారితీసింది పద్మ.

"ఎంత, ఇంకొక్క రెన్నెళ్ళు ఓపిక పట్టు" అని టీవీ ఆన్ చేశాడు రంగనాథం.

రంగనాథం కేంద్ర ప్రభుత్వోద్యోగి. నెల జీతం అయిదు వేలకు పైనే ఉన్నా, ముంబయి వంటి నగరంలో ముగ్గురు పిల్లల్తో సంసారం నడపడానికి హైరానా పడవలసి వస్తోంది. ముక్కుకు సూటిగా పోయే రకం అవడంవల్ల పై సంపాదన లేదు. వచ్చిన దాంతోనే పొదుపుగా గుంభనంగా దినాలు వెళ్ళదీస్తున్నాడు. పెద్దబ్బాయి శిరీష్ బి.కామ్. పాసై డి.టి.పి. డిప్లమా చేస్తున్నాడు. పార్ట్ టైం కంప్యూటర్ ఆపరేటర్‌గా తన సొంత ఖర్చులకు సంపాదిస్తున్నాడు. అమ్మాయి ఇంటరు చదువుతోంది. చిన్నవాడు ఎనిమిదవ తరగతిలో ఉన్నాడు.

రాత్రి తొమ్మిది తర్వాత శిరీష రాగానే కుటుంబ సభ్యులంతా భోజనానికి కూర్చున్నారు. "ఎంతదాకా వచ్చింది నీ డిప్లొమా?" శిరీష్‌నడిగాడు రంగనాథం.

"వచ్చే నెల పరీక్షలున్నాయి నాన్నా."

"ట్రైనింగ్ బాగా అయిందా?"

"అయింది. డిస్టింక్షన్ తప్పక వస్తుంది నాన్నా."

"ఇప్పటి నుండే ఉద్యోగానికి అప్లై చేస్తుండు. ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజిలో రిజిష్టరు చేయి."

"నాకు ఉద్యోగం చేయడం ఇష్టంలేదు నాన్నా."

"ఉద్యోగం చేయవా?"

"సొంతంగా డి.టి.పి. సెంటర్ పెట్టుకోవాలని ఉంది."

పెట్టుబడి సంగతి ఆలోచించావా? భోంచేయి ఆ తర్వాత మాట్లాడదాం.

భోజనాలయింతర్వాత పద్మ, చిన్నపిల్లలు టీవీ ముందు కూర్చుంటే, తండ్రీకొడుకులు లోపలి గదిలో కెళ్ళారు.

"ఇప్పుడు చెప్పు నీ ఉద్దేశ్యం."

"దరఖాస్తులు పంపుతూ టెస్టులు రాస్తూ, ఇంటర్వ్యూలకు అటెండవుతూ ఉద్యోగం కొరకు పడిగాపులు పడేదానికన్నా కంప్యూటరు కొనుక్కుని డి.టి.పి. సెంటరు పెట్టుకోవాలని ఉంది."

"ఎంతవుతుందేమిటి?"

"కొత్త మెషిన్లయితే లక్ష రూపాయల పైనే కావచ్చు, పాతవి యాభై వేల లోపల వస్తాయి."

"డబ్బెక్కడికి నుండి వస్తుందని"

"మీరు సర్దితే సరే. లేకపోతే బ్యాంకు లోనుకు ప్రయత్నం చేస్తాను."

"మన స్థితిగతులు నీకు తెలియనివి కాదు. ఇప్పటికే ఆఫీసులో దొరికే అన్ని లోన్లూ తీసుకున్నాను. వాటి వాయిదాలు పోను, చేతికొచ్చే జీతంతో, ఇంటి ఖర్చు, మీ చదువు ఖర్చులతో ఎలా నెగ్గుకొస్తున్నానో నాకు తెలుసు. పైన ఆ భగవంతునికి తెలుసు. నీవు ఉద్యోగంలో చేరితే నాకు వెసులుబాటుగా ఉంటుంది."

"నేనడిగేది నా సొంత ఖర్చులకు కాదు నాన్నా. ఇంటికి పెద్దబ్బాయిగా నా సొంత బాధ్యతలు తెలుసు. మనం ఇంకా మంచి జీవనం గడపాలనే నా ఆశయం. ఏ ఉద్యోగం చేసినా గొర్రెతోక బెత్తెడే అన్నట్లు, వచ్చిన జీతం మన కనీస అవసరాలు కూడా తీర్చలేదు. అదే వ్యాపారమైతే మన ఆదాయానికి హద్దుండదు. మన శ్రమ ఫలితం మనమే అనుభవించవచ్చు." ఇరవై రెండేళ్ళ శిరీష్‌లో యువరక్తం ఉరకలు వేస్తూంది.

"వ్యాపారం అంటే మాటలా? పెట్టుబడి కావాలి. నేర్పు కావాలి, వాయిదాలకు, వడ్డీలకు, ఖర్చులకు సరిపడ ఆదాయముంటుందనే గ్యారంటీ ఏమిటి?"

"అవన్నీ ఆలోచించాను నాన్నా. నేను కంప్యూటరు తీసుకుంటే ఇంట్లోనే పని చేయవచ్చు. ఇన్స్టిట్యూట్‌వాళ్లే జాబ్‌వర్క్ ఇస్తారు. అదనపు కంప్యూటర్లు లేక, తగిన పనివారు లేక, వారు కొత్త క్లయింట్లను తీసుకోవడం లేదు. తీసుకున్నా పని కూడా సకాలంలో పూర్తి చేయలేకపోతున్నారు."

"బిజినెస్సు ఇలాగే వస్తుందని నమ్మకమేమిటి? పోటీ పెరిగి వ్యాపారం దెబ్బతినవచ్చు."

డి.టి.పి. అంటే డెస్క్‌టాప్ పబ్లిషింగ్ బిజినెస్. తగ్గే ప్రసక్తే లేదు. ముద్రణ అవసరం ఎంతదాకా ఉంటుందో అంతదాకా ఈ బిజినెసుకు ఢోకాలేదు. మూడేళ్ళ కింద ఒక్క కంప్యూటరుతో మొదలుపెట్టిన మా ఓనరు ఇప్పుడు అయిదు కంప్యూటర్లు, రెండు లేజర్ ప్రింటర్లు, రెండు డాట్‌మ్యాట్రిక్స్ ప్రింటర్లు నడిపిస్తున్నాడు. జాబ్‌వర్క్‌తోపాటు కంప్యూటర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ నడుపుతూ నాలుగు కాదు – పదహారు చేతులా సంపాదిస్తున్నాడు."

"పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టు, ఎవరో ఏదో చేసి సంపాదిస్తున్నాడు, మనం గూడా చేద్దామంటే అయ్యే పనేనా? దానికి తగ్గ అనుభవం ఎక్కడుంది నీకు? బిజినెస్ నడిపేది చాకచక్యం ఉందనే అనుకుంటున్నావా?"

"క్షమించండి నాన్నా, మీకు చెప్పదగ్గవాణ్ణి కాను. ధైర్యే సాహసే లక్ష్మి, అని మీరే అంటుంటారు కదా! పని చేస్తేనే గదా అనుభవం వచ్చేది?"

"సరే ఆలోచిద్దాం. పరీక్షలు మాత్రం బాగా చేయి" అని పడుకోటానికి లేచాడు రంగనాథం.

"ఏమిటండీ అంత రాత్రి దాకా మీ తండ్రీ కొడుకుల మంతనాలు? మంచి సినిమా మిస్సయ్యారు" పొద్దున కాఫీ ఇస్తూ అంది పద్మ.

"నీ టీవీ పిచ్చి నీదేగాని, మన సంసారం గురించి, బతుకుబాట గురించీ ఎప్పుడైనా ఆలోచించావా?"

"మీరుండగా సంసారం గురించి నేనెందుకు ఆలోచించాలి? అయినా ఇప్పుడు మన బతుకు బాటకేమొచ్చింది?"

"నేననేది మన గురించి కాదు. మన పిల్లల బతుకుతెరువు గురించి శిరీష్ వ్యాపారం చేస్తాడట. 'స్వయం ఉపాధి' పిచ్చి తలకెక్కింది. పెట్టుబడికి డబ్బులు సర్దాలట. హాయిగా ఉద్యోగం కొరకు ప్రయత్నించరా అంటే ససేమిరా అంటున్నాడు."

"మీరే మాలోచించారు?"

"నాకేటూ తోయడంలేదు. సాయంత్రం పంచాక్షరి దగ్గరికెళతాను. ఈ విషయంలో అతనే సరైన సలహా ఇవ్వగలడు."

పంచాక్షరి ఛార్టెడ్ ఎకౌంటెంటు. సొంత ప్రాక్టీసు బాగా నడుస్తుంది. అతను, రంగనాథం ఎల్.ఎల్.బి.లో సహాధ్యాయులు. ఇద్దరూ ముక్కుకు సూటిగా పోయేవారవడం వల్ల వారి మధ్య స్నేహం కలిసింది. గట్టి పడింది. స్థాయీ భేదం వారి మిత్రత్వానికి అడ్డుకాలేదు.

రంగనాథం పంచాక్షరి ఆఫీసుకు చేరేసరికి సాయంత్రం ఆరున్నర అయింది. టీ, ఫలహారాల తర్వాత కబుర్లలో పడ్డారు మిత్రులు.

"ఆ.. ఏమిటీ అకాల దర్శనం?" సాధారణంగా ఆదివారాల్లో తప్ప కలవని మిత్రుణ్ని అడిగాడు పంచాక్షరి.

"మా శిరీష్ విషయంలో నీ సలహా తీసుకుందామని"

"ఉద్యోగం చూడాలా? డి.టి.పి. చేస్తున్నాడు గదా పూర్తయిందా?"

"ఇంకా లేదు. వచ్చే నెల పరీక్షలు వాడికి. ఉద్యోగం చేయడం ఇష్టం లేదు. సొంత డి.టి.పి. సెంటరు పెట్టుకోవాలనుకుంటున్నాడు."

"భేష్, నా గాడిలోకి వస్తాడన్నమాట. అభినందనలు"

"నువ్వూ వాడికి వత్తాసు పలుకుతున్నావా? మాలాంటివాళ్ళతో వ్యాపారం అయ్యేనా? పెట్టుబడి ఎక్కడినుండి తేవడం?"

"ఏం, మీకేం తక్కువ? వ్యాపారం చేసేవాళ్ళు పై నుండి ఊడిపడతారా? ఇక పెట్టుబడి సంగతి నా కొదిలేయ్."

"నా విషయం నీకు తెల్సుగా. మన మధ్య డబ్బు లావాదేవీలు వద్దు. మన స్నేహం ఇలానే ఉండనీ."

"పే కమిషన్ ఎరియర్స్ ధీమానా అది?"

"ఆ ఎరియర్స్ ఎప్పుడో కలర్ టి.వి.కి అంకితమయ్యాయి. అవి చేతికి రావడమే తరువాయి, ఇంట్లో కలర్ టి.వి. కళకళలాడబోతోంది" భవిష్యత్తును తలచుకుని సంబరపడ్డాడు రంగనాథం.

"టి.వి. అంత అవసరమంటావా? అదే డబ్బుల్తో కంప్యూటరు కొంటే వడ్డీ దక్కుతుంది. ఆదాయం వస్తుంది" పంచాక్షరిలోని సి.ఎ. బయటకు వచ్చాడు.

"నేను పద్మకిచ్చిన మాట కాదని, ఆ తర్వాత సుఖంగా ఉండగలనా?"

భార్యను తలుచుకోగానే వణుకు పుట్టింది రంగనాథంకు.

"అది మీ ఇద్దరూ తేల్చుకోవల్సిన విషయం. వినోదమా, బతుకుతెరువా? ఆలోచించుకోండి. ప్రాథమికతలు నిర్ణయించుకోండి. ఈలోగా శిరీష్‌ను పంపించు."

వాడి నుండి వివరాలు కనుక్కుంటాను. ఎంత లోతులో ఉన్నాడో తెలుసుకుంటాను. పై పై ఉత్సాహం అనిపిస్తే ఉద్యోగం చేయమంటాను. పట్టుదలతో పైకొస్తాడనుకుంటే చేయూతనిస్తాను" పంచాక్షరి మనస్ఫూర్తిగా అన్నాడు.

* * *

"రావోయ్ రా, ఇండస్ట్రియలిస్టు కావాలని కలలు కంటున్నావట నిజమేనా?"

తన ఆఫీసుకు వచ్చిన శిరీష్‌ను పలకరించాడు పంచాక్షరి.

'మీలాంటి పెద్దల అండతో, ఆశీర్వాదంతో పారిశ్రామికవేత్తను కూడా అవుతానేమో. ప్రస్తుతానికి మాత్రం నా కాళ్ళమీద నిలబడాలనుకుంటున్నాను అంకుల్" సరియైన జవాబిచ్చాడు శిరీష్.

"జాబ్ వర్కుకు మీ ఇన్‌స్టిట్యూట్ వారి మీదే ఆధారపడతావా, వేక వేరే ఎవర్నయినా చూశావా?"

"చాలామందిని కలిశానంకుల్. కొందరు డి.టి.పి. పని ఇస్తామని వాగ్దానం చేశారు. ముఖ్యంగా తెలుగు సాఫ్ట్‌వేర్ పెట్టాలని ఉంది. తెలుగు ప్రింటింగు వసతులు అంతగా లేని

ముంబయిలో ఈ సౌకర్యం కల్పిస్తే ఇక్కడ దాదాపు పది లక్షలున్న తెలుగువారు ఆమాత్రం పని ఇవ్వకపోరు. అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలు, ప్రింటింగ్ ప్రెస్సులు ఇచ్చే పని అదనంగా వస్తుంది" దృఢంగా అన్నాడు శిరీష్.

శిరీష్ మాటలతో ఇంప్రెస్ అయిన పంచాక్షరి అతని డి.టి.పి. సెంటర్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చాడు. రంగనాథం పెట్టుబడి సన్నాహాలు చేయసాగాడు. పద్మ కలర్ టి.వి. ఇంకొంత దూరం పోయింది. ప్రాథమికతల పందెంలో బతుకుతెరువు ముందు వినోదం వీగిపోయింది.

జీవితంలో ఓ కొత్త పాఠం నేర్చుకున్నారు రంగనాథం, పద్మ దంపతులు.

**(ఆంధ్రప్రభ వీక్లీ 4-5-1998)**